


## శ్రీ పూడిపెద్ది వెంకటరమణయ్య


ఏనాటినుంచో కలకత్తా వెళదామని అనుకుంటూ అనుకుంటూ కఱ్ర దొరికితే కుక్క దొరకక కుక్క దొరికితే కఱ్ర దొరకక — అలా ప్రయాణం వెనకబడుతూ వచ్చింది. తుదకెలాగయితేనేం తెగించేను. [illegible] తారా చంద్రబలాలు చూచుకొని ముహూర్తం పెట్టించేను. మూటాముల్లె కట్టుకున్నాను. ఎక్కడి కయినా సరేనే ఒక్కడనూ ఎప్పుడూ వెళ్లలేదు. ఎవరో ఒకరు కూడా ఉండాలి. కాని కలకత్తాదాకా నాతో ఎవడు వస్తాడు? ఒక వేళ రమ్మంటే రామేశ్వరం 'రావు' వస్తాడేమో. కాని వాడికికూడా ఖర్చులు నేనే పెట్టుకోవాలి. వాడిదగ్గిర డబ్బులేదు. తీరా రమ్మన్నానా ఒక్కరైలు ఖర్చుతో పోదు. అందుకోసం ఊరుకున్నాను. ఒక్కడనే సిద్ధపడ్డాను. భయమేమిటి? నోట్లో నాలికె ఉంటే అంతా స్నేహితులే! నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది. నాకొంపాటి హిందీముక్కలు కూడా వచ్చును.

సందెవేళ: స్టేషనులో దీపాలు పెట్టేరు. ఆ స్టేషనులో రైలు ఎక్స్‌ప్రెస్సు ఆగదు; అందులోనూ మెయిలు. నా సామానును కూలివాడిచేత పట్టించుకొని వచ్చి మంచి పెట్టెకోసం వెతుకుతున్నాను. చాలాదూరం ప్రయాణం చెయ్యాలి. మర్నాడు రెండుజాములదాకా రైలులోనే ఉండాలి. కాస్త కాళీగావున్న పెట్టె చూసుకొని కూచుందామని రైలంతా వెతుకుతున్నాను. 'ఇదుగో బాబూ చిన్నపెట్టె' అని కూలివాడు కేకపెట్టేడు. చప్పున ఆ పెట్టె తలుపు తీసి చూచేను. ఒకబెంచీ అంతా ఖాళీగా ఉంది. ఎదుటి బెంచీమీద ఎవరో పడుకొని ముసుగుబెట్టుకొని నిద్రపోతున్నారు. 'ఆఁ బాగుం

ది. కావలసినంత జాగా!...కాలక్షేపానికి మనిషి కూడా దొరికినట్టే...అనుకొని సామానులన్నీ పై అటుకబల్ల మీద యిమిడికగా పేర్చి బెంచీమీద నాబిచాణా విప్పి పరిచేను. ఆబిచాణా మధ్యను కూర్చున్నాను. రైలు కదిలింది. ఎంత గడబిడ అవుతున్నా ఆయెదుటి బల్లమీది వ్యక్తి అటు ముఖమిటు తిప్పనయినా తిప్పలేదు. కదలనయినా కదలలేదు. చిన్న గుర్రుమాత్రం పెట్టి నిద్రపోతున్నది. గొంతు దాకా కప్పుకొని వుంది. తలమాత్రం పైకి కనబడుతూ వుంది. నే నొకసారి ఆవైపుచూచి నా సర్దుబాటులో మునిగి పోయాను. కాలిజోడుతీసి బల్లకింద పడేసి, కోటుతీసి నలగకుండా మడతపెట్టి తలగడకింద పెట్టి, నా యిమిటేషన్ కాశ్మీరశాలువ తీసి చెవులంటా కప్పుకొని వెలుపలికే ముఖంతిప్పి పడుకున్నాను.

కలకత్తా ఎలాగుంటుందోనని నేను నా మూసుకొన్న కనురెప్పలలో పట్టణ చిత్రాలన్నీ చిత్రించుకొంటూ పడుకున్నాను. 'శాగుంది! హాయిగా, యింతజాగా దొరుకుతుం దనుకోలేదు. ఒక్కొక్క నాడు రైలులో కూడా చోటు దొరుకుతుంది – ఒక్కొక్కనాడు పై అటుక ఆసరా పట్టుకుని గబ్బిలంలాగా వేలాడుతూ నిలబడిపోవాలి,...ఈ పెట్టె ఒక్కటీ యింత సదుపాయంగా ఉంది. కాని తక్కిన పెట్టెలు చూచేను కానూ, ఎక్కడా కాలు పెట్టడానికయినా జాగాలేదు! ఎంచేత ఈపెట్టె ఇంత ఖాళీగా వుందో!...ఇది ఇంటరుక్లాసు కాదు. గోనెపరుపులు లేవు. తలుపుమీద III అంకె ఉంది కూడాను. కాస్త చదువుకున్న నేనే కంగారు అవుతున్నాను గదా, ప్రజఇది పెద్ద క్లాసేమోనని ఎక్కడం మానివేసి ఉంటారు...'

ఎదటి బల్లమీద పడుకున్న వ్యక్తి చేయి పయికి తీసి ముసుగు చెవిమీదికి సర్దుకొంది.



చేతికి బంగారు గాజులూ, వేలికి వుంగరమూ ఉన్నాయి. సన్నని వేళ్లూ, చిన్న చేయీని. ఆచిన్న వెలుగుదీపంలో ఆనగలు మెరిశాయి. ఆచేయి తిరుగా కప్పులోకి వెళ్లి పోయింది. తలకట్టు వుంగరాలు వుంగరాలుగా గొగ్గులు గొగ్గులుగా వుంది...'అయ్యో! ఆడుది?...ఈమె ఒక్కరితే ఇందులో పడుకుంది. నే నెందుకెక్కా

నురా దేవుడా! ఇందులోకి? తనకోసమే ఎక్కేనంటుంది కాబోలు!...అనుకోనీ...నా హృదయం నాకు తెలుసునుగదా! పాపం పుణ్యం భగవంతునికే తెలుస్తుంది!' గోడవేపు తిరిగేను. ఏదో జంకుగా దొంగతనం చేసినట్టుంది...ఆఁఆఁ ఇది ఆడువాళ్ల పెట్టె కాబోలు. అన్నా! ఏందారి! ఇలాటి చిక్కులో పడ్డానూ. చప్పున లేచి తలుపు దగ్గరకు వెళ్లి తల అవతలకు పెట్టి తలుపు పయిని చూచేను. ఏమిటి కనబడుతుంది? చీకటి; గాఢాంధకారము! కిటికీలోనుంచి పైకివంగి తలుపు మీాదను ఆడుబొమ్మగానీ ఆడువారికి అనిగానీ ఉంటుందేమోనని ఆశతో చూచేను. జేబులో అగ్గిపెట్టెతీసి పుల్ల వెలుతురున చూడబోయేను. ఒకడజను పుల్లలదాకా వెలిగించేను. 'రంయి' మని వీచేగాలిలో అన్నీ బుసబుసా వెలిగి వెంటనే ఆరిపోతూ వచ్చాయి. వచ్చేస్టేషను యింకా యెంతదూరముందో? ఏమీా యెరగనట్టు పడుకుంటాను. ఏమయితే అదేకానీ! పొరపాటుకేం చేస్తారు? అప్పుడు దిగి పొమ్మంటూ రింకోబండిలోకి - పోతాను. మరేం చెయ్యడం? ఈలోగా యీామె లేచి అన్యాయంగా నాకే దురుద్దేశం కట్టబెడుతుందో? తిరిగివెళ్లి నాబల్ల నడమను కూర్చున్నాను...

'నా బల్లే మిటి?...స్వేచ్ఛగా ఊర్పులు తీస్తూ పడుకున్న ఆమెను నిలువునా చూచేను. ముఖం పెడగా వట్రువగా వుంది. అయ్యో! పాపం యీామె గర్భవతి కూడాను - కడుపెత్తుగా వుంది. బరువుగా లేచి పడుతూంది. పాపం ఆడుదాని దొకగండం...ఈమెకీన ప్రొద్దు లేమో...అందుకే యీాగది ఈమెకు ప్రత్యేకించి వుంటారు...అయితే ఆడుతోడు లేండే, ఎవరూ దగ్గిర లేకుండానే, ఒక్కరైనూ విడిచేసేరే!! ఆమె భర్త అవతల పెట్టెలో మగవాళ్లబండిలో కూర్చుని వుంటాడు కాబోలు. ఏం చెయ్యడం మరి ఇంకొకతోడు లేకపోతే? బాగుంది! కొసకు!'

'ఇదేమిటి ఇలాటి చిక్కులో పడ్డాను! వాడే కోప్పిష్టివాడో! ముందూ వెనకా ఆలోచించకుండా ఈబండిలో నన్ను చూచీ చూడడముతో ఫెడీల్మని లెంపకాయ కొట్టేస్తే ఏం చెయ్యడం? ముందుగా చూచుకోక పోవడం తప్పు నాది' వణుకుతూన్న వ్రేళ్లతో నాబాడ లెడవికొన్నాను. కళ్లలో నీళ్లు తిరిగాయి. నిజంగా దేవుడన్నవాడుంటే నావంటి అమాయకులను కాచుకొని తిరగవద్దూ! లేదు - ఆ దేవుళ్ల పలుకుబడీ అవీ నాడేపోయినాయి. ఎంతపనీ! ఎందుకు బయల్దేరేను? "ఏంపని మించిపోతూంది. ఎందుకిప్పుడు సొమ్ము దండుగ పెడతారు -" అని మాయిల్లాలు శతపోరింది. దాని మాటయినా విన్నానుకాను. డబ్బు మాటకేం? ఒళ్లునొప్పి, అగౌరవం, అపనిందా, అన్నీవూరికే చుట్ట పెడుతున్నాయి.

రెప్ప వాల్చకుండా ఆమె తలకట్టే ఆలా చూస్తూ కూర్చున్నాను. రైలు ఆగింది. ఇక నాగుండెకూడా ఆగిపోతూం దనుకున్నాను. లేచి నిలచి తలుపు దగ్గిరకువచ్చి కిటికీలోనుంచి పైకి చూచేను. రైలెంత సేపాగుతుందో ఎవరినయినా కనుక్కుందామను కున్నాను. దూరంగా గుడ్డి దీపాలు అక్కడక్కడా రాటలమీాద వెలుగుతున్నాయి. తెల్లని షరాయి తొడుక్కొని చేత్తో లాంతరు వూచుకొంటూ వస్తున్నా డతడు. నాకు ప్రాణాలు నిలువునా ఎగిసిపోయినవి. నాబండిదగ్గిర కాతడు వచ్చి

నిలచేడు. నాకు చైతన్యం వుందో లేదో... దాడసలుపు మాత్రం తోచింది. నన్నాతడు చురచురా చూచి "ఏమయ్యా, నీకేం మతి పోతుందా ఏమిటి? రైలక్కడే ఆపించెయ్యా లను కొన్నాను. దొంగ లా గున్నావే?" అన్నాడు.

"కానండీ, తెలిసింది కాదండీ. క్షమించండి, నా సామానులు తీసుకొని దిగేస్తాను" అన్నాను.

"దిగయితే! రైలు నీకోసం కనిపెట్టుకొని వుంటుందా? వేషంచూస్తే కాస్త చదువుకొన్న వాడిలాగు కనబడతావు! ఇంతటి మూర్ఖుడ వేమయ్యా! బలే! దిగు, దిగవేం!" అంటూ నా చేతిలో సామానులు వడిగా లాక్కొని ప్లాటుఫారం మీదికి విసిరేశాడు. నేనూ దిగుతున్నాను.

"నయం! రైలుకు నిప్పంటించే స్టేషను కొన్నాను. వెర్రివాడి లాగున్నానే!" అని అతడు అంటున్నాడు. నేనేదో మాటాడబోతూ వుంటే నా రెక్కపట్టుకొని తోసేసేడు. పడబోయి ఆచుకుని 'కూలీ' అని కేకపెట్టేను. ఎవడో "ఆఁ" అని అవతల కొసనుంచి నీడలాగు లీలగా నడిచి వస్తూన్నాడు.

ఆ పెద్దమనిషి నేను దిగిన పెట్టెతలుపు దడాలున వేసి విజిలూదేడు. ఆ పెట్టెలో యింత సేపూ నిద్రపోతూన్న వ్యక్తి లేచి కిటికీదగ్గిర నిలచింది. గుండ్రని కోడుమొగం - గిరజా కత్తిరింపు తలకట్టూ, ఎత్తుపొట్ట. ఎడమచేత్తో తడుముకుంటూ నిలచేడు. బంగాలీ బాబు లాగున్నాడు. వానిచేతికి రిస్టువాచీ, గొలుసూ, వుంగరమూ కాస్త మెరిసి కనబడ్డాయి. నేను తెల్లబోయేను... అయ్యో అతగాడు గార్డు, పెట్టెకు నిప్పంటించేడ మన్నాడు. ఇందాక నే నగ్గిపుల్లలు వెలిగించడం చూచేడు కాబోలు... అయ్యో రైలు కదుల్తుంది కాబోలు. నేనేదో చెప్పబోతూ వుండగా నా మాటలు స్టేషన్లో కొట్టిన గంట చప్పుడులో మింగుడు పోయినాయి. "అయ్యో అయ్యో" నేనెంతో పిలిచేను. ఈలోగా కూలివాడు నా సామానులు సవరిస్తున్నాడు. నేను చించుకున్నట్టు మొర్రో మొర్రోమని కేకపెట్టేను. రైలు కదిలిపోయింది. నేనున్న దగ్గరకు గార్డుపెట్టె వచ్చింది. గార్డు దానిలో కెక్కుతూ, "జాగ్రత్త! ఇలాంటి వెర్రిపనులు ఎప్పుడూ చేయకు" అన్నాడు. ఎవడు విన్నాడు నా మొర్ర!

ఇలా వెలిగాయి నా కలకత్తా ప్రయాణమూ, నా పెట్టెలో అగ్గిపుల్లలూనూ.

